క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా..



దామెర: అభయ ఆంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి కృషిచేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచంద్ రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెల్లలో ఆలయ పునఃనిర్మాణ పనులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణపు పనులు తన సొంత ఖర్చులతో చేపడతానని తెలిపారు. గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు. త్వరగా పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల రమేశ్, మందాటి శ్రీకాంత్, రోహిత్, శ్రీకాంత్, ప్రశాంత్, అనిల్, సుమంత్, నవీన్, చిరంజీవి, జక్కుల కుమార్, బొంకూరి రవి, ఇండ్ల రాజు, మాదాసు కీర్తి, రాజ్‌కుమార్, సాంబరాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందిని తీర్చిన కౌన్సిలర్

- సొంత ఖర్చులతో సీసీ రోడ్డు పనులు



పరకాల: గుంతలమయంగా మారిన రోడ్డుతో తన వార్డు ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో తన సొంత ఖర్చులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించి.. శభాష్ అనిపించుకున్నాడు పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి. పరకాల మున్సిపాలిటీలోని 9వ వార్డు పరిధిలోని హుజూరాబాద్ రోడ్డులోని మురారి గల్లీ 20 కుటుంబాల ప్రజలు సీసీ రోడ్డు లేక గత 10 సంవత్సరాల నుంచి అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా.. ఫలితం లేకపోవడంతో పూర్ణాచారి సొంత ఖర్చులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించాడు. దీంతో ప్రజలు కౌన్సిలర్‌ను అభినందించారు.

సౌండ్ సిస్టం అందజేత



వేలేరు: మండల కేంద్రంలోని సెయింట్ ఫ్రాన్సిస్ డీసెల్స్ చర్చికి బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ ఇట్టబోయిన భూపతిరాజు రూ.80 వేల విలువ చేసే సౌండ్ సిస్టంను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవుల కోరిక మేరకు సౌండ్ సిస్టంను ఫాదర్ కిరణ్‌కు ఆదివారం అందజేసినట్లు తెలిపారు. అనంతరం చర్చిలో మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ గోవింద సురేశ్, ముదిరాజ్ సంఘం చైర్మన్ సంపత్, శ్రీకాంత్, జోగు ప్రసాద్, కిరణ్ పాల్, రాజు, అశోక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం



దామెర: బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ మెంతుల రాజు అన్నారు. మండలంలోని పులుకుర్తికి చెందిన గోవిందు మాలగం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, విషయం తెలుసుకున్న మెంతుల రాజు ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. నాయకులు పేరబోయిన కిరణ్ కుమార్, ఈదునూరి సంతోష స్వామి, దుర్శెట్టి రమేశ్, గోవిందు ఆదామ్, దయాకర్, నగేశ్, బక్కయ్య పాల్గొన్నారు.

మద్యం మత్తులో తమ్ముడిపై అన్న దాడి

పరకాల: మద్యం మత్తులో తమ్ముడిపై బీర్ సీసాతో దాడి చేసిన సంఘటన పరకాల పట్టణంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల పట్టణానికి చెందిన మడికొండ అనిల్, అతని సోదరుడు జీవన్.. బస్టాండ్ సమీపంలోని వైన్స్ వద్ద మద్యం సేవించి రోడ్డుపైకి వచ్చారు. ఇరువురి మధ్య మాట మాట పెరిగిపోవడంతో తమ్ముడు అనిల్‌పై మత్తులో ఉన్న జీవన్ దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన అనిల్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

వరినాట్లు షురూ..



పొలంలో నాటు వేస్తున్న కూలీలు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు



నారు తీస్తున్న కూలీలు

- ఎల్కతుర్తి మండలంలో 8,400 హెక్టార్ల సాగుభూమి
- పొలం పనుల్లో రైతన్నల బిజీ
- సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం

ఎల్కతుర్తి: మండల కేంద్రంలో యాసంగి వరినాట్లు ప్రారంభమయ్యాయి. వానాకాలంలో సాగుచేసిన వరిపంట ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతో ఆసక్తిగా రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. నెలరోజుల క్రితం పోసిన వరినార్లు నాటేందుకు అనుకూలంగా సిద్ధమైంది. దీంతో రైతులు దుక్కులు దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు పొలాలను ఇప్పటికే సిద్ధంచేసి కూలీల సాయంతో వరినాట్లు వేయిస్తున్నారు. దీంతో పలుగ్రామాల్లో వరినాట్ల జోరు కన్పిస్తుంది. ఎస్సారెస్పీ ఆయకట్టు కింది రైతులు నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తే వరినాట్లు మరింత ఊపందుకోనున్నాయి. మరో పక్క ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వడంతో రైతులు ఎక్కువగా సన్నరకం వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు. ఈ యాసంగిలో వరిసాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలు అంచనా వేస్తున్నారు. మండల పరిధిలో మొత్తం 19 గ్రామ పంచాయతీలకు మరో మూడు అనుబంధ గ్రామాలు ఉన్నాయి.

8,400 హెక్టార్లలో సాగుభూములు

మండలంలో 8,400 హెక్టార్లలో సాగుభూములు ఉండగా.. ఇందులో 3,200హెక్టార్లలో రైతులు వరి పంటను సాగుచేస్తున్నారు. అయితే ప్రస్తుతం వ్యవసాయ బావులకింద రైతులు 2,100 హెక్టార్లలో వరి పంటను సాగుచేసే అవకాశాలు ఉన్నాయి. కాగా, వానాకాలం ఆరంభంలోనే వర్షాలు సంవృద్ధిగా కురువడంతోపాటు దేవాదుల ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపడం జరిగింది. దీంతో భూగర్భ జలాలు సైతం అమాంతం పెరిగాయి. దీంతో యాసంగి సాగుకు ఇబ్బందిలేదని అధికారులు ఇప్పటికే తేల్చి చెప్పారు. రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు.

ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కమలాపూర్: ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి సలహాలివ్వాల్సిన కేసీఆర్ ఫామ్ హౌజ్‌లో పడుకుంటున్నాడని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మండలంలోని అంబాలలో ఏఎంసీ నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన దేశిని ఐలయ్యగౌడ్‌ను ఆదివారం ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ హయాంలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ హయాంలో జరగొద్దని, అలా జరిగితే తమ పేరు పోతుందని బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు మమ్మల్ని ఎక్కడ మర్చిపోతారోనన్న భయంతో కౌశిక్‌రెడ్డి లాంటి ఎమ్మెల్యేలను అడ్డం పెట్టుకొని వ్యవహరిస్తున్న తీరు రాష్ట్ర ప్రగతికి మంచిది కాదని పేర్కొన్నారు. అసెంబ్లీలో రైతులకు సంబంధించిన చర్చ పెడితే రైతు సమస్యలపై చర్చించకుండా మాకు కల్వకుంట్ల కుటుంబమే ఎక్కువని, కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావు కోసమే కొట్లాడుతాం అన్నట్లుగా కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరు, ఒక దళిత స్పీకర్‌ను అవమానించే విధంగా ప్రవర్తించిన తీరును యావత్ తెలంగాణ సమాజం గమనించిందన్నారు. కేటీఆర్ తప్పు చేసి దొడ్డిదారిన నిధులు దారి మళ్లించాడని సంబంధిత శాఖ విచారణ జరుపుతోందన్నారు. కుటుంబ సభ్యులను అడ్డం పెట్టుకొని చస్తానని బెదిరించి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్‌రెడ్డి.. తమ సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కరిస్తాడని భావిస్తే వారి నమ్మకాన్ని వమ్ము చేశాడని అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ఎన్నికల వరకే పార్టీలు అని, ఆ తర్వాత ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన ప్రణవ్‌తో ఎలాంటి విబేధాలు లేవన్నారు. సమావేశంలో జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ అరుకాల వీరేశలింగం, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలని వినతి

మండల కేంద్రంలోని భక్తాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు.. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌లను ఆదివారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నాయకులను కలిసిన వారిలో జనార్దన్, రమేశ్, రంజిత్, రాజేశ్‌కుమార్, వెంకటేశ్, కిషోర్, అరుణ్‌కుమార్, కిట్టు, అఖిల్, శ్రీను ఉన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు సరికాదు



ఐనవోలు: నిరసన తెలుపుతున్న డీఎస్పీ నాయకులు



ఆత్మకూరు : క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఐనవోలు: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) మండల అధ్యక్షుడు కొత్తూరి ప్రవీణ్ అన్నారు. ఆదివారం డీఎస్పీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రజలందరూ దైవంగా భావించే అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యంగ్యంగా మాట్లాడుతూ అందరి మనోభావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ప్రతిపక్ష నాయకులు కూడా స్పందించకపోవడం దారుణమన్నారు. అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అమిత్ షా చిత్రపటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కుమారస్వామి, నస్కుల రాజేందర్, బరిగల విష్ణు, కే అనిల్, కొండేటి తరుణ్, ఉదయ్, జయపాల్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

ఆత్మకూరు : అంబేడ్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలంలోని గూడెప్పాడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ మాట్లాడారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా పై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్, యూత్ ఉపాధ్యక్షులు నరేశ్, రాజ్‌కుమార్, శ్రీశైలం, కరీం, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- భూ భారతి చట్టంతో రైతులకు మేలు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోపే రాష్ట్రవ్యాప్తంగా రూ.21 వేల కోట్లతో రుణమాఫీ చేపట్టిందని, రైతాంగానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం ఏఓ గంగజమున అధ్యక్షతన జాతీయ ఆహార భద్రత పథకం (ఎన్ఎఫ్ఎస్ఎం)లో భాగంగా 20 మంది రైతులకు యాసంగి సీజన్‌లో 15 కిలోల వరి ధాన్యం విత్తనాల బస్తాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం రూపొందించిన ధరణి పోర్టల్‌తో రైతులకు పట్టా పాస్ పుస్తకాలు, రుణాలు రాక అవస్థలు పడ్డారని ఆరోపించారు. అర్హులైన రైతులకు సంక్షేమ పథకాలు అందకుండా పోయాయని అన్నారు. పంట సాగు చేస్తున్న రైతులందరికీ పట్టా పాస్ పుస్తకాలు, రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు అందాలనే ఉద్దేశంతో సర్వే చేపట్టి సీఎం రేవంత్ రెడ్డి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. గతంలో కలెక్టర్‌కి అధికారాలు ఉండేవని, ప్రస్తుతం ఆర్డీఓ, తహసీల్దార్లకు భూభారతిలో సవరణ అధికారం ఇచ్చారన్నారు. భూమి దున్నే వారికే పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జనవరి చివరి వరకు రైతులందరికీ రైతు భరోసా అందజేస్తామని తెలిపారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలు ఆపకుండా అందజేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పేరుతో రూ.వేల కోట్లు దోపిడీ చేసిందని ఆరోపించారు. ఉగాది నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో 19 మందికి రూ.4.98 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా.. శాయంపేట గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు బాసాని కైలాసం ఇటీవల అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం వాగ్వాదం

సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమం పూర్తయి అందరూ వెళ్తుండగానే రైతు వేదిక ఎదుట పత్తిపాక మాజీ ఎంపీటీసీ గజ్జి ఐలయ్య, పరకాల ఏఎంసీ డైరెక్టర్ వైద్యుల వెంకటరాజిరెడ్డితో వాగ్వాదానికి దిగారు. సబ్సిడీ విత్తనాలు అందజేయడానికి రైతుల జాబితా ఎవరు తయారు చేశారని, తనకు సమాచారం లేకుండానే ఎలా తయారు చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ మండల శాఖ ఆదేశాల మేరకు కొంతమంది వారి అనుకూల రైతులకు మాత్రమే విత్తనాలు ఇవ్వడం ఏంటని వాదించాడు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు

- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్



ప్రచారం చేస్తున్న డీబీఎఫ్ నాయకులు

ఆత్మకూరు: రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు జరుగుతున్నాయని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్ అన్నారు. మండలంలోని గూడెప్పాడ్, నాగయ్యపల్లె గ్రామాల్లో ఆదివారం రాజ్యాంగ దినోత్సవ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పెద్దలు, బీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేశ్, ధర్మ సమాజ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మైదం రవి, రజనీకాంత్, సుధాకర్, రమేశ్, ప్రమీల, కోమల తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు రక్షణగా చట్టాలు

ఖానాపురం : వినియోగదారులకు హక్కుల రక్షణకు చట్టాలున్నాయని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రతన్ సింగ్, జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ తెలిపారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వస్తువులు కొనుగోలు చేసిన సమయంలో నకిలీ, కల్తీ, తదితర మోసాలకు గురైనట్లు భావిస్తూ చట్టాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వస్తువులు కొనుగోలు చేసిన సమయంలో తప్పకుండా బిల్లులు తీసుకోవాలని చెప్పారు. వినియోగదారులు మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18004250033కు సమాచారం అందించాలని తెలిపారు. సమావేశంలో వార్డెన్ లావణ్య, సంఘం బాధ్యులు లక్ష్మయ్య, ప్రభాకర్, సారంగం, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల హక్కు చట్టం తీసుకురావాలి

- మానవహక్కుల వేదిక నాయకులు



వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

దామెర: కౌలు రైతుల హక్కుల చట్టం తీసుకురావాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బాదావత్ రాజు, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ అన్నారు. చెందిన కౌలు రైతులు మండలంలోని ల్యాదెళ్లకు పకిడె రమేశ్, ఒగ్లాపూర్‌కు చెందిన మన్నెం అనంత రెడ్డి ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. కాగా మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ కమిటీ సభ్యులు ఆదివారం పర్యటించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మహత్యకు పాల్పడిన ఇద్దరు రైతులు గత కొన్ని సంవత్సరాలుగా భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. దిగుబడి సరిగా రాక, సరైన మద్దతు ధరలేక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకోవడం జరిగిందని అన్నారు. దీనికితోడు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, పురుగు మందుల కారణంగా ఎంతో మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వాలు బాధ్యత వహించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులకు రైతు బీమా వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరి వెంట బాధిత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

అబాకస్, వేదిక్‌తో పరిజ్ఞానం మెరుగు

- రాజేంద్రప్రసాద్‌రెడ్డి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రమోదర్‌రెడ్డి, యుగేందర్

పరకాల: గణిత సమస్యలను సులభతరంగా తెలుసుకునేందుకు అబాకస్, వేదిక్ మ్యాథ్ విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని బిట్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని బిట్స్ పాఠశాలలో అబాకస్, వేదిక్ మ్యాథమేటిక్స్ జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల కార్యక్రమానికి బిట్స్ ప్రిన్సిపాల్ యుగేందర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. 4 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఐక్యు లెవెల్స్, చురుకుదనం పెంపొందించుకునేందుకు అబాకస్, వేదిక్ ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రమోదర్‌రెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గణితశాస్త్రం అన్ని శాస్త్రాలకు మూలం

దామెర: గణితశాస్త్రం అన్ని శాస్త్రాలకు మూలమని డీస్నీల్యాండ్ పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డీస్నీల్యాండ్ పాఠశాలలో ఆదివారం గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గణితశాస్త్రంపై భయం పోగొట్టుకొని ఇష్టం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో దయ్యాల మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, రాకేశ్‌భాను, దినేశ్‌చందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల సొమ్మును దోచుకునేందుకే విలీనం

నర్సంపేట రూరల్ : ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకునేందుకే మునిసిపాల్టీల్లో గ్రామాల విలీన ప్రక్రియను చేపట్టిందని ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి విమర్శించారు. పట్టణంలోని మాదన్నపేటలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడారు. గ్రామాలను నిర్వీర్యం చేసి పర్యావరణాన్ని దెబ్బతీయడంతోపాటు వ్యవసాయ రంగాన్ని రోడ్డున పడేసేలా పన్నుల భారాన్ని మోపుతోందంటూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. విలీన ప్రక్రియను ప్రజల అభిప్రాయం మేరకు కాకుండా కేవలం కొందరు అధికార పక్ష నాయకుల స్వార్థం కోసం చేపడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా విలీనానికి నిర్ణయించడం సరికాదన్నారు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ రెండు నెలల క్రితమే మాదన్నపేట నుంచి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. కేశెట్టి సదానందం, అనుమాల రమేశ్, కర్నె సాంబయ్య, కేశెట్టి శ్రీనివాస్, నర్సయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోశ్

ఆత్మకూరు: అక్రమంగా రవాణా చేస్తున్న ఎండు గంజాయిని ఆత్మకూరు పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ సంతోశ్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఒర్రె వంశీ వరంగల్ నగరంలోని కీర్తినగర్‌కు చెందిన అనీఫ్ వద్ద కిలో 100 గ్రాముల ఎండు గంజాయిని కొనుగోలు చేశాడు. అధిక ధరకు విక్రయించడానికి తన ఆటోలో రవాణా చేస్తున్నాడు. అదేసమయంలో అక్కంపేట వద్ద ఎస్సై అశోక్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా వంశీ ఆటో ఆపకుండా వెళ్తుండగా పోలీసులు పట్టుకొని విచారించగా ఎండు గంజాయి లభ్యమైంది. వెంటనే ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ఆటో, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

కౌలు రైతుల కుటుంబాలను ఆదుకోవాలి



వివరాలు సేకరిస్తున్న నాయకులు

ఆత్మకూరు : కౌలు రైతుల కుటుంబాలను ఆదుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బాదావత్ రాజు డిమాండ్ చేశారు. మండలంలోని అక్కంపేట, తిరుమలగిరి గ్రామాల్లో ఆత్మహత్యకు పాల్పడ్డ సంపత్, సాంబమూర్తి కుటుంబాలను ఆదివారం మానవ హక్కుల వేదిక నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. కౌలు రైతుల హక్కుల చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దిలీప్ పాల్గొన్నారు.

ఐనవోలులో గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేయాలి



నందిసెంటర్ నుంచి భజన చేస్తూ ఆలయానికి వెళ్తున్న వరప్రసాద్ కుటుంబ సభ్యులు

ఐనవోలు: అరుణాచలం తరహాలో మల్లన్న ఆలయం, ఊరగుట్ట చుట్టూ ప్రదక్షిణ చేసేలా ప్రభుత్వం, ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కేంద్రానికి చెందిన భక్తులు కోరారు. ఆదివారం ఐనవోలులో గిరి ప్రదక్షిణ సంకల్పం నెరవేరాలని వరంగల్ పిన్నావారి వీధికి చెందిన రవ్వ వరప్రసాద్-లావణ్య, సాయి రితీష్ కుటుంబ సభ్యులు పున్నేలు క్రాస్ నుంచి మల్లన్న ఆలయం వరకు 6 కిలోమీటర్ల మేర భజన చేస్తూ పాదయాత్ర ద్వారా ఐనవోలుకు చేరుకున్నారు. మల్లికార్జునస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాగా.. మండల కేంద్రానికి చెందిన టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు సారంగపాణి భక్తులతో మాట్లాడుతూ.. మల్లికార్జునుడు గ్రామానికి సమీపంలో ఉన్న ఊరగుట్టపై వెలిసినట్లు భక్తులు ఇప్పటికీ చెప్పుకుంటారని గుర్తు చేశారు. గుట్ట చుట్టూ ప్రదక్షిణ మార్గం ఏర్పాటు చేసి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు సూచిస్తున్నట్లు సారంగపాణి పేర్కొన్నారు.

భూమి అక్రమ రిజిస్ట్రేషన్

నల్లబెల్లి : భూమి అక్రమ రిజిస్ట్రేషన్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. మండలంలోని రుద్రగూడెంకు చెందిన అబ్బు సంజీవరెడ్డికి చెందిన సర్వే నంబర్ 10/బిలోని 23 గుంటల భూమిని గ్రామానికి చెంది వక్కల వెంకటేశ్ కొనుగోలు చేశాడు. సదరు భూమిని స్థానికుడైన ఓ కబ్జాదారు నాగరాజుపల్లి నుంచి సర్వే నంబర్ లేకుండా 40 ఏళ్లుగా హక్కులు ఉన్నట్లు తప్పుడు యాజమాన్య ధృవీకరణ పత్రాన్ని సృష్టించాడు. సదరు పత్రాలతో నర్సంపేట సబ్ రిజిస్ట్రార్‌ను తప్పుదోవ పట్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. భూయజమాని సమాచార హక్కు చట్టం ద్వారా ఇటీవల సేకరించిన సమాచారంతో అక్రమ రిజిస్ట్రేషన్ బట్టబయలైంది. ఈ సందర్భంగా బాధితుడు వక్కల వెంకటేశ్ విలేకరులతో మాట్లాడుతూ తాటిరెడ్డి రాజిరెడ్డి అతడి భార్య విజయ పేరిట అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపించారు. రెవెన్యూ రికార్డుల్లోనూ అక్రమంగా రాజిరెడ్డి పేరు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన రాజిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.